క్లుప్తంగా

నేడు కోర్టుల సముదాయంలో యోగా దినోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక కోర్టుల సముదాయంలోని బార్ అసోసియేషన్ భవనంలో జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.వరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. అమలాపురం ఓం శాంతి కేంద్ర కార్యాలయానికి చెందిన బ్రహ్మకుమారీలు యోగాపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, మెజిస్ట్రేట్‌లు, ఉద్యోగులు, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొంటారన్నారు.

డాక్టర్ వీరభద్రానికి ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు



వీరభద్రాన్ని సత్కరించిన పలు సంస్థల ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక కామాక్షీ పీఠం ఆస్థాన సిద్ధాంతి డాక్టర్ కర్రా వీరభద్రాన్ని అంతర్జాతీయ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ అంతర్జాతీయ అస్ట్రో ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 23న ఢిల్లీలో అవార్డును ప్రదానం చేయనుంది. ఈ సందర్భంగా స్థానిక విశ్వేశ్వర అగ్రహారంలో వీరభద్రాన్ని పలువురు పండితులు, రచయితలు సత్కరించారు. కార్యక్రమంలో రచయిత పుత్సా కృష్ణ కామేశ్వర్, విశ్రాంత హిందీ పండితుడు చక్కా రామకృష్ణ సత్యానందం, విశ్రాంత అధ్యాపకుడు శ్రీగిరి గోపాలకృష్ణ, వాకర్స్ క్లబ్ కార్యదర్శి వలవల వెంకట రెడ్డినాయుడు, పచ్చిగోళ్ల రాజా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రమణారావు పరామర్శ



సరిపల్లిలో మృతుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రమణారావు

ఉప్పలగుప్తం: మండలంలోని సరిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన గెద్దం బాలస్వామి, గెద్దం సరోజిని కుటుంబాలను గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ గెద్దం సురేష్ బాబు, అమలాపురం నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి పినిపే జయరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నేలపూడి సుగంధ కుమార్, కోరుకొండ రెడ్డి రత్నం, కిరణ్ తదితరులు ఉన్నారు.

మలాథియాన్ పిచికారీ



గురుకులంలో మలాథియాన్ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

అల్లవరం: గోడిలంక పీహెచ్‌సీ పరిధిలోని గోడి బాలురు, బాలికల గురుకులాల్లోని హాస్టల్, తరగతి గదుల్లో గురువారం దోమల నివారణకు మలాథియాన్ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఎస్‌వీ రామారావు, కేవీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ మలాథియాన్ మందు స్ప్రేయింగ్‌తో విద్యార్థులకు దోమకాటుకు గురవకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, గురుకులం సిబ్బంది పాల్గొన్నారు.

500 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో క్రీమ్ సేవా సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక బాప్టిస్టు మందిరంలో జరిగిన వైద్య శిబిరంలో పిఠాపురం సీఎంసీ ఆస్పత్రి వైద్యులు సుమారు 500 మందికి నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా శస్త్ర చికిత్సలు అవసరమైన 70 మందిని పిఠాపురం సీఎంసీ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించనున్నట్లు శామ్యూల్ సాగర్ తెలిపారు. కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణుడు సీరం సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శివారుకు నీరు.. ఇచ్చేదెవరు సారూ..!

- శివారు ఆయకట్టుకు చేరని కాలువల నీరు
- ముమ్మిడివరం, అమలాపురం సబ్ డివిజన్‌లో ఖరీఫ్ ఆలస్యం
- అధికారులు దొరక్క నానా అవస్థలు పడుతున్న రైతులు



కేశనకుర్రు-తిళ్లకుప్ప ప్రధాన పంట కాలువ

ఐ.పోలవరం: ముందస్తు ఖరీఫ్ నిమిత్తం రైతులు నారుమడులు వేసుకునేందుకు వీలుగా గత మూడేళ్లగా జూన్ 1వ తేదీ నుంచే పంట కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది సైతం ఈ నెల 1వ తేదీ నుంచే కాలువకు నీరిచ్చారు. ప్రస్తుతం మధ్య డెల్టాకు రోజుకు 1,565 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా మధ్య డెల్టాలోని శివారు భూములకు సాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదు. అనేక కాలువలకు నీరు చేరడం లేదు. సమస్య తీవ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. దీనివల్ల ముమ్మిడివరం, అమలాపురం సబ్ డివిజన్‌లో ఖరీఫ్ ఆలస్యమవుతుందని అన్నదాతలు వాపోతున్నారు.

అమలాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పరిధిలో ఖరీఫ్‌కు సంబంధించి సుమారు 24 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. అలాగే ముమ్మిడివరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలతో పాటు కాకినాడ జిల్లాలోని తాళ్లరేవు మండలంలో కలిపి సుమారు 41 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. ముమ్మిడివరం, అమలాపురం సబ్ డివిజన్లకు బొబ్బర్లంక-పల్లంకుర్రు, బొబ్బర్లంక-అమలాపురం, నడిపూడి-చల్లపల్లి, నడిపూడి-అల్లవరం(బెండా కెనాల్) ద్వారా రైతులు సాగు చేస్తుంటారు. అయితే ఈ రెండు సబ్ డివిజన్లలోనూ శివారు ప్రాంతాలు అధికం. పైగా పంట కాలువకు అనుబంధంగా ఉండే ఛానల్స్(మీడియం కాలువలు) ఏకంగా 12 నుంచి 18 కి.మీ.ల పొడవు ఉంటాయి. అధికారులు తూతూమంత్రంగా నీరు వదులుతుండడతో శివారు పొలాలకు చేరడం లేదు. పైగా అధికారులు వంతులవారీ విధానం వంకతో కేవలం కొన్ని కాలువలకే నీరిచ్చి మరికొన్ని కాలువలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీనిపై సంబంధిత ఇరిగేషన్ అధికారులను కలవడానికి ప్రయత్నిస్తే ఎప్పుడు ఎక్కడుంటారో తెలియడం లేదని, కాళ్లరిగేలా తిరిగినా కార్యాలయంలో కనిపించడం లేదని, ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నిస్తే అందుబాటులోకి రావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చేసేది లేక వరుణుడినే ప్రార్థించుకుంటున్నారు.

15 శాతం కూడా పడని నారుమడులు

ఐ.పోలవరం మండలం పరిధిలోని కేశనకుర్రు, తిల్లకుప్ప, జి.వేమవరం, మూలపొలం, ఎర్రగరువు తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. తొలకరి ప్రవేశించిన తరువాత పూర్తి స్థాయిలో వర్షాలు లేకపోవడంతో నారుమడులకు రైతులు పూర్తిగా కాలువ నీటి మీదే ఆధారపడాల్సి రావడం వల్ల కూడా సాగు ముందుకు సాగడం లేదు. అమలాపురం, ముమ్మిడివరం రెండు సబ్ డివిజన్ల పరిధిలో 15 శాతం కూడా నారుమడులు పడలేదని అంచనా. పరిస్థితి ఇలాగే ఉంటే సాగు ఆలస్యం అవుతోందని వ్యవసాయశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఎట్టి పరిస్థితులలో జూన్ నెలాఖరు నాటికి నాట్లు పూర్తి కావాలని, అప్పుడు ముందస్తు సాగు ప్రయోజనాలు అందుతాయని వారు చెబుతున్నారు.

నీరందక నారుమడులు ఆలస్యం



మా శివారు పొలాలకు సాగు నీరు చేరడం లేదు. ఈ కారణం వల్ల నారుమడులు అనుకున్నంత వేగంగా వేయలేకపోతున్నాం. కనీసం వర్షాలు పడినా దమ్ములు మొదలు పెట్టేవాళ్లం. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివారు పొలాల రైతులకు నీరివ్వాలని కోరుతున్నాం.
– కె.నాగేశ్వరరావు, తిళ్లకుప్ప

విద్యా ప్రవేశ్‌పై విద్యార్థులకు శిక్షణ

కాట్రేనికోన: పూర్వ ప్రాథమిక విద్యకు పునాది వేసేందుకు విద్యాశాఖ ప్రవేశపెట్టిన విద్యా ప్రవేష్ పైలెట్ ప్రాజెక్టుపై శిక్షణ పొందిన ఇన్వెస్టిగేటర్లతో ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు శిక్షణ అందించి ముల్యాంకన పరీక్షలు నిర్వహించారు. మండల పరిధిలోని చిర్రయానం, గచ్చకాయలపోర ప్రాథమిక పాఠశాలలను గురువారం అకడమిక్ మానిటరింగ్ అధికారి రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 14 జిల్లాల్లో విద్యా ప్రవేష్ బేస్‌లైన్ టెస్టును పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారన్నారు. విద్యా ప్రవేష్ కార్యక్రమంలో భాగంగా ఒకటో తరగతి విద్యార్థులకు 90 రోజుల పాటు రోజుకు రెండు గంటల చొప్పున ఆట, పాటలతో పాటు తెలుగు, గణితంపై ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. మండలంలో పల్లం, బ్రహ్మసమేధ్యం, చిర్రయానం ప్రాథమికోన్నత పాఠశాలలు విద్యా ప్రవేష్ పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక య్యాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కేటీవీవీ సుబ్రహ్మణ్యం, ఇన్వెస్టిగేటర్స్ పి.సత్యనారాయణ, పి.ఏడుకొండలు, ఏవీవీ వర్మ, సీఆర్ఎంటీ ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని శాఖలకు మాతృశాఖ రెవెన్యూ



అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులను సత్కరించిన తహసీల్దార్ సునీల్‌కుమార్



విశ్రాంత వీఆర్ఓలను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

అల్లవరం: దేశంలోని అన్ని శాఖలకు రెవెన్యూ శాఖ తల్లి లాంటిదని, ఈ శాఖ నుంచి అన్ని శాఖలు పుట్టుకొచ్చాయని విశ్రాంత తహసీల్దార్ ఎస్.అప్పారావు అన్నారు. అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్లు ఎస్.అప్పారావు, వడ్డి సత్యవతి, కార్యాలయ సబార్డినేట్ బైరిశెట్టి వెంకటరత్నంలను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీతలు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవలో రెవెన్యూ శాఖ ముడిపడి ఉందన్నారు. పోలీస్, వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు-భవనాలు, ఎక్సైజ్, వైద్యం, అగ్నిమాపక శాఖలతో సమన్వయ పరచుకుంటూ పౌర సేవలను అందిస్తుందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేకతను చాటుకుందన్నారు. 1772 మే 14న బెంగాల్ గవర్నర్ వారన్ హేస్టింగ్ భూమి శిస్తు వసూళ్ల నిమిత్తం జిల్లా కలెక్టర్‌ను నియమించారన్నారు. 1786లో మద్రాసు రాష్ట్రంలో రెవెన్యూ బోర్డు స్థాపించారని తెలిపారు. అప్పటి నుంచి రెవెన్యూ శాఖ మాతృశాఖగా పిలవబడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, మండల సర్వేయర్ కృష్ణకుమారి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వీఆర్ఓల యూనియన్ అధ్యక్షుడు ఉందుర్తి చిట్టిబాబు, వీఆర్ఓలు లీలాంబ, హరి, రాజు, పీవీ, వెంకటరెడ్డి, రత్నంరాజు, వీర్రాజు, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ జూనియర్ సహాయకుడిగా శ్రీనివాసరావు



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

అమలాపురంలోని జిలా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన రెవెన్యూ దినోత్సవంలో అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ సహాయకుడు ఎస్.శ్రీనివాసరావుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా ఉత్తమ రెవెన్యూ అధికారిగా ప్రశంసాపత్రం అందించి అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవవర్ధన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ముమ్మిడివరం: రెవెన్యూ ఉద్యోగులు ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించి వారితో మమేకం అవడం ద్వారా రెవెన్యూ వ్యవస్థకు మరింత గౌరవం పెరుగుతుందని తహసీల్దార్ బి.శ్రీనునాయక్ పేర్కొన్నారు. ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే సందర్భంగా జరిగిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగులు వాటర్ టాక్స్ వసూలుతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని సేవలను అందిస్తున్నారన్నారు. సదస్సులో విశ్రాంత వీర్వోలు మాచిరాజు రాజబాబు, బందారు మహేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్ఓ సంఘ నాయకులు కేశనకుర్తి వెంకటేశ్వర్లు, రామేశ్వరపు శ్రీనివాస్, ఆర్ఐ పంతం శ్రీనివాసరావు, మండల సర్వేయర్ కేవీవీఎస్ ప్రసాద్, కె.మన్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



తాళ్లరేవు హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ టెక్స్ట్, నోట్ పుస్తకాలతో పాటు షూలను విద్యార్థులకు గురువారం అందజేశారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను పొందుతూ ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 7,448 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మోకా ఉమ, హెచ్ఎం జె.ఆశాలత, నాయకులు కుడుపూడి శివన్నారాయణ, పొన్నమండ రామలక్ష్మి, ఉంగరాల వెంకటేశ్వరరావు, చిట్టూరి చలపతి, పాలెపు పోశియ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తమకు ప్రాధాన్యమివ్వలేదని పలువురు టీడీపీ, జనసేన నాయకులు కార్యక్రమాన్ని బహిష్కరించారు.

నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన అవసరం



విద్యార్థులకు నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న ఏపీసీ మధుసూదనరావు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణ, మొక్కలను పెంచడం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్(ఏపీసీ) ఎ.మధుసూదనరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'సేవ్ వాటర్– సేవ్ లైఫ్' అనే అంశంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి వివరించారు. అనంతరం పాఠశాల కిచెన్ గార్డెన్‌ను సందర్శించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఎకో క్లబ్ మెంబర్లు ఆర్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కె.బాలకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ వై.జ్యోతి, గణితావధాని టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు కేవీఎస్ శర్మ, ఫిజికల్ డైరెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ కిచెన్‌ను పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్



సెంట్రల్ కిచెన్‌ను పరిశీలిస్తున్న పుదుచ్చేరి మధ్యాహ్న భోజన పథక డిప్యూటీ డైరెక్టర్ కుమరన్ తదితరులు

యానాం: నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేసే సెంట్రల్ కిచెన్‌ను గురువారం పుదుచ్చేరి మధ్యాహ్న భోజన పథక డిప్యూటీ డైరెక్టర్ కుమరన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సెంట్రల్ కిచెన్ రోజువారీ మెనూ గురించి, వంట పదార్థాల నాణ్యత, కిచెన్‌లో శుభ్రత గురించి విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. యానాం పట్టణం స్కూల్స్‌తో పాటు తీరప్రాంత గ్రామాల స్కూల్స్‌కు సైతం సెంట్రల్ కిచెన్‌లో తయారుచేసిన ఆహారాన్ని అందిస్తామని తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును సైతం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి మహిళా విద్య డిప్యూటీ డైరెక్టర్ శివరామరెడ్డి, రత్నరాజు, సెంట్రల్ కిచెన్ ఇన్‌చార్జి పాము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



భవిత కేంద్రంలో పోటీలను పరిశీలిస్తున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక హైస్కూల్ ఆవరణలోని భవిత సెంటర్‌లో మిషన్ లైఫ్ యాక్టివిటీలో భాగంగా వాటర్ సేవ్ కార్యక్రమంపై భవిత విద్యార్థులకు గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్ఎస్ఏ సీఎంఓ బి.సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ భవిత విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సరేళ్ల దుర్గాదేవి, ఫిజియోథెరపీ వైద్యుడు గౌతమ్ గంగాధర్, భవిత సెంటర్ ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, ఎ.నానాజీ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యానాం విద్యార్థిని మౌనిక ప్రతిభ



యానాం: స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని మల్లాది మౌనిక పీజీ సీయూఈటీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్సీ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సీటు సాధించిందని ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్సీ ఫిజిక్స్ చదివే విద్యార్థులకు దేశవ్యాప్తంగా మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. యానాం విద్యార్థులు బీఎస్సీ ఫిజిక్స్‌ను ఎంచుకోవడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అధ్యాపకులంతా మౌనికను అభినందించారు.

ప్రతి విద్యార్థీ బడికి వెళ్లేలా కృషి చేయాలి



బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్చాలంటూ ర్యాలీ చేస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్



తాళ్లరేవులో నేను బడికి పోతా ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని ప్రతి విద్యార్థీ బడికి వెళ్లి చదువుకునేలా అందరూ కృషి చేయాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సీఆర్ఎంటీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 6 నుంచి 14 సంవత్సరాల వయసుండి బడికి వెళ్లని పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్చేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.కిరణ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి

తాళ్లరేవు: పిల్లలను పనిలో కాదు బడిలో చేర్పించాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం మండల కేంద్రమైన తాళ్లరేవు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన వీధిలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని నినదిస్తూ అవగాహన ర్యాలీ, మానవ హారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ మోకా ఉమ, పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ, పాఠశాల హెచ్ఎం జె.ఆశాలత, ఉపాధ్యాయులు వాకపల్లి అప్పారావు, పుల్లేటి కిషోర్, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి సత్కారం



వివిధ రంగాల ప్రతినిధులను సత్కరిస్తున్న యోగాశ్రమ గురువు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

అమలాపురం టౌన్: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారిని స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమంలో యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 89 ఏళ్ల వయసున్న యోగా గురువు మారిశెట్టి సత్యనారాయణ, డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరానికి సహకరిస్తున్న కుడుపూడి సత్యనారాయణ, బండారు సత్యనందన్, గరిమెళ్ల నారాయణమూర్తి, రచయిత పుత్సా కృష్ణ కామేశ్వర్‌లను సత్కరించారు. యోగా దినోత్సవం సందర్భంగా యోగాశ్రమం ఆధ్వర్యంలో అనాథలు, యాచకులకు ఆహార పొట్లాలు అందించారు. యోగాశ్రమ ప్రతినిధులు చిలుకూరి వివేక, గరిమెళ్ల నాగదేవి దేవసేన, ఎం.పూర్ణ, గరిమెల్ల అమృతవల్లి, కె.ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



ఎమ్మెల్యే బుచ్చిబాబును సత్కరిస్తున్న సర్పంచ్ చిరంజీవి తదితరులు

ముమ్మిడివరం: నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో అనాతవరం సర్పంచ్ మిమ్మర్తి చిరంజీవి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, దాట్ల పృథ్వీరాజ్, శివరాజు, కుడిపూడి శ్రీనివాసరావు, మట్టపర్తి శ్రీరామచంద్రమూర్తి, పాటి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



తాళ్లరేవులో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు హైస్కూల్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తిచేసుకుని ఎంపీపీ స్కూల్లో చేరిన 209 మంది పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి మాట్లాడుతూ పిల్లల మానసిక ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను ప్రాథమిక పాఠశాలకు అనుసంధానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి సహకరించండి

యానాం: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అమరావతిలోని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భౌగోళికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న యానాం నియోజకవర్గానికి సాగు, తాగు నీరు తదితర అంశాల్లో సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. యానాం రైతులంతా సాగునీరు కోసం ధవళేశ్వరం ఇరిగేషన్ వ్యవస్థపైనే ఆధారపడ్డారన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ.పోలవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ మోకా రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముమ్మిడివరం: విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు.

యూకే సమావేశాల్లో ప్యానల్ సభ్యునిగా సాంబశివరావు

అమలాపురం టౌన్: వచ్చే నెల ముంబైలో జరగనున్న ఎకో కాన్షస్‌నెస్ ఎక్స్‌పోకు, యూకేలో నిర్వహించే సమావేశాలకు ప్యానల్ సభ్యునిగా పాల్గొనాలంటూ అమలాపురానికి చెందిన లీడ్ ద లైవ్స్ సంస్థ సీఈవో చిక్కం సాంబశివరావుకు ఆహ్వానం అందింది. ఆయన గత నెల 18న ముంబైలోని రేడియో క్లబ్ భవనంలో జరిగిన యోగా అండ్ వెల్‌నెస్ ఫెస్టివల్‌లోనూ ప్యానల్ సభ్యుని హోదాలో పాల్గొన్నారు.